క్లుప్తంగా

పంచాయతీ కార్యాలయం తనిఖీ

కంభం: మండలంలోని హజరత్ గూడెం పంచాయతీలో అవినీతి జరిగిందంటూ ఆరోపిస్తూ టీడీపీ నాయకుడు ఇటీవల చేసిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం మార్కాపురం డీఎల్‌పీఓ భాగ్యవతి హజరత్‌గూడెం పంచాయతీ కార్యాలయంలో తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు.

విద్యుత్ మీటర్లు దగ్ధం


కాలిపోయిన విద్యుత్ మీటర్

కంభం: మండలంలోని యర్రబాలెంలో హైవోల్టేజ్‌తో సుమారు 26 మీటర్లు దగ్ధమైన సంఘటన గురువారం రాత్రి జరిగింది. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యంతో గతంలో కూడా ఇలా విద్యుత్ సమస్య తలెత్తి మీటర్లు కాలిపోయాయని స్థానికులు చెబుతున్నారు. గురువారం రాత్రి జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో 28 మీటర్లు కాలిపోవడంతో పాటు పలువురి గృహాల్లో టీవీలు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు దగ్ధమయ్యాయి. విద్యుత్ శాఖాధికారులు గ్రామంలో కాలిపోయిన మీటర్ల స్థానంలో నూతన మీటర్లు బిగిస్తున్నారు. తమకు జరిగిన నష్టాన్ని విద్యుత్ శాఖ భరించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

నర్సరీల తనిఖీ


నర్సరీని తనిఖీ చేస్తున్న విష్ణుప్రియ

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటు వద్ద ఉన్న నర్సరీలను ఉద్యానవన శాఖాధికారి విష్ణుప్రియ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విష్ణుప్రియ నర్సరీల యజమానులతో మాట్లాడుతూ నర్సరీలకు లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. చీడపురుగులు, తెగుళ్ల యాజమాన్యం చేసి నాణ్యమైన మొక్కలు రైతులకు అందించడమే నర్సరీల చట్టం ముఖ్య ఉద్దేశమన్నారు. నర్సరీలు రిజిస్ట్రేషన్ చేసుకుని రిజిస్టర్లు నిర్వహించాలన్నారు. మొక్కల ఎదుగుదల ఆధారంగా ఎరువులు అందించాలన్నారు. మొక్కలను అమ్మినప్పుడు రైతులకు రసీదులు అందించాలని తెలిపారు.

పోలేరమ్మతల్లికి పొంగళ్లు


కుంకుమ బండికి పూజలు చేస్తున్న ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో గురువారం రాత్రి పోలేరమ్మతల్లి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, సర్పంచ్ అనురాధవెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ప్రకటించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అమరజీవి పొట్టి శ్రీరాములు కౌన్సిల్ హాల్లో నిర్వహించాల్సి ఉంది. శుక్రవారం కౌన్సిల్ సమావేశానికి ముగ్గురు వైఎస్సార్ సీపీ, ఒక టీడీపీ, మరో కోఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. గత నెలలో కూడా కౌన్సిల్ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే.


కొమరోలు: మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ నరసయ్య


మొక్కలు నాటుతున్న ఏపీడీ భాస్కరరావు

పచ్చదనం పెంపొందించాలి

బేస్తవారిపేట: ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ భాస్కరరావు అన్నారు. శుక్రవారం వనం మనం కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గృహ పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని కోరారు. భూగర్భ జలాల అభివృద్ధి, సకాలంలో వర్షాలు పడేందుకు మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీఓ పార్వతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఈఓపీఆర్‌డీ రామాంజనేయులు, ఏంఈఓ సీహెచ్ రమణారెడ్డి, టీఏ అంబటి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరు శ్రద్ధ చూపాలి

గిద్దలూరు రూరల్: మొక్కల పెంపకంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం సందర్భంగా మండలంలోని కె.ఎస్.పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను పెంచితే ఆహ్లాదకర వాతావరణ సంతరించుకుంటుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపాలన్నారు. ఈ సందర్భంగా మొక్కల సంరక్షణ బాధ్యతగా భావిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులతో ఆయన మాట్లాడారు. పాఠశాలలోని విద్యార్థులకు అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను కోరారు. అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు, రేంజీ ఆఫీసర్ కుమార్‌రాజ, జెడ్పీటీసీ బుడత మధుసూదనరావు, డీఆర్‌ఓ రాజశేఖర్‌గౌడ్, ఎఫ్ఎస్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు కె.వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కంభం: కందులాపురంలో..

కంభం: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ (రజని) అన్నారు. మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అటవీశాఖ అధికారులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని సంకల్పం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ ఎం. రాజు, అటవీ శాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: ప్రతి ఒక్కరూ మొక్కలు సంరక్షించి ఎక్కువ సంఖ్యలో పెంచాలని ఎంపీడీఓ డి.నరసయ్య తెలిపారు. మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో వన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ డి.నరసయ్య పాల్గొని శుక్రవారం బాలికలతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ బాలికలు మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనాన్ని పెంచాలని తెలిపారు. మండలంలోని తాటిచెర్ల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ డీఆర్ఓ ఆనందరావు, ఎఫ్‌బీఓ మౌలాలీ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు మొక్కలు నాటారు. ఏపీఓ మహాలక్ష్మి, కస్తూరిబా గాంధీ విద్యాలయం ప్రత్యేక అధికారి రోజీసులోచన పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


మొక్కలు నాటుతున్న సర్పంచ్, ఫారెస్టు అధికారులు

మార్కాపురం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని దరిమడుగు గ్రామ సర్పంచ్ బట్టగిరి గౌతమి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం దరిమడుగు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె మొక్కలు నాటారు. సబ్ డీఎఫ్ఓ వేణు, ఎఫ్ఆర్ఓ వరప్రసాద్, సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు, డీఆర్‌ఓలు ప్రసాద్‌రెడ్డి, నాగరాజు, ఎఫ్‌బీఓడబ్ల్యు రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం రామసుబ్బారావు, ఏపీఓ జీవరత్నం, ఎంపీటీసీ పేతురు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు

కొనకనమిట్ల: శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో మహిళలందరూ విశేష పూజలు నిర్వహించారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకొని తెలుగు సంస్కృతికి అద్దం పట్టారు. రేగడపల్లి పోలేరమ్మతల్లి ఆలయం, వద్దిమడుగు ఎల్లమ్మతల్లి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.

మార్కాపురం టౌన్: శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి, జగందాంబసమేత మార్కండేశ్వరస్వామి, కల్యాణ వేంకటేశ్వరస్వామిలతో పాటు పలు ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాస తిరు నక్షత్ర మహోత్సవం సందర్భంగా రామానుజ చార్యుల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చక్కా మాలకొండ నరసింహారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలి

పొదిలి: ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పొదిలిలో శుక్రవారం రాత్రి నిరసన కార్యక్రమం నిర్వహించారు. సంఘ జిల్లా సహాధ్యక్షుడు అబ్దుల్‌హై మాట్లాడుతూ.. పోరాటాల ద్వారా సాధించుకున్న పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాల్సిందేనన్నారు. సుప్రీం కోర్టు తీర్పులను సైతం లెక్క చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. కొన్ని రాష్ట్రాల్లో పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. జీపీఎస్‌కు మరో రూపంగా ఉన్న యూపీఎస్ స్కీమ్‌తో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఏమాత్రం లాభం లేదన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ఎన్నిక

రాచర్ల: గిద్దలూరు నియోజకవర్గ అపుస్మా (ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్ మేనేజిమెంట్‌ల అసోసియేషన్) అధ్యక్షుడిగా రాచర్ల స్పందన విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గిద్దలూరు, కొమరోలు, రాచర్ల, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల అధినేతలు పాల్గొని అపుస్మా నూతన కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా జి.రత్నంబాబు, అధ్యక్షుడిగా పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గౌరికృష్ణారెడ్డి, కార్యదర్శిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా జి.మధులత, కోశాధికారిగా గణేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులుగా పి.మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాసులు ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పేర్ల సుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గ ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరం కలిసి సమన్వయంతో పనిచేద్దామని, తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఆరు మండలాల సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

వక్ఫ్ భూముల ఆక్రమణపై విచారణ


రికార్డులు పరిశీలిస్తున్న నారాయణ

కంభం: విలువైన వక్ఫ్, దేవాలయ భూములు ఆక్రమణలకు గురువుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని గత నెల 27వ తేదీన ఒంగోలులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం మైనారిటీ అండ్ వక్ఫ్‌బోర్డ్ డిప్యూటీ కలెక్టర్ డి.నారాయణ కంభం తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని చెబుతున్న సర్వే నంబర్లకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు జయరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా దిశ మారింది


నాడు.. 28వ తేదీన ఇలా



నేడు... సరిచేసిన తర్వాత సీసీ కెమెరా

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులోని గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా దిశ మారడంపై ఈ నెల 28వ తేదీన 'ఈ పక్కచూపులు ఎవరికోసమో..' శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం సీసీ కెమెరా దిశను సరిచేశారు. శాంతి భద్రతలు, నేరగాళ్ల కదలికలు, వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ చొరబాట్లు తదితర విషయాలను పరిశీలించేందుకు సీసీ కెమెరాలను పకడ్బందీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు.

ట్రెజరీ అధికారుల తీరుపై పీటీడీ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న ఆర్టీసీ డిపో సిబ్బంది

మార్కాపురం: ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్(ఆర్టీసీ) ఉద్యోగులతో ట్రెజరీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక డిపో గ్యారేజీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి నైటవుట్ అలవెన్సులు, మెడికల్ రీయింబర్స్‌మెంటు బిల్లులు, రిటైర్‌మెంట్ అలవెన్సులు, డీఏ, అరియర్స్ బిల్లులు, ఇంక్రిమెంట్ బిల్లులు పాస్ చేసేందుకు ట్రెజరీ అధికారులు లంచం అడుగుతూ ఇబ్బంది పెడుతున్నారని ఎస్ఎంయూ సెక్రటరీ కె.కాశయ్య, రీజినల్ నాయకులు మల్లికార్జునరావు, నాగిరెడ్డి ఆరోపించారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను ఆమోదించాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ట్రెజరీ అధికారులు నిరంకుశ వైఖరి విడనాడాలని హితవు పలికారు. ధర్నాలో గ్యారేజీ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, మూర్తయ్య, శివారెడ్డి, సలీమ్, సుబానీ, హుస్సేన్, రవికుమార్, రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర దానంపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ నేత్రదానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కంటి వైద్యుడు జీకే మోహన్‌రెడ్డి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా పట్టణంలోని రాజుపారా మెడికల్ కాలేజీ ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. భారత దేశంలో 15 శాతం మంది ప్రజలు అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. వీరిలో ప్రధానంగా 8 లక్షల మంది చిన్నారులు కార్నియల్ అంధత్వంతో బాధపడుతున్నారన్నారు. మరణానంతరం వారి నేత్రాలను దానం చేస్తే ఒక నిండు జీవితానికి వెలుగును ప్రసాదించినవారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం అపోహలను వీడి నేత్రదానం పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు శివశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణ అందరి బాధ్యత

● విశ్రాంత ఆర్జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి


డాక్టర్ వీరారెడ్డిని సన్మానిస్తున్న మధుసూదన్ తదితరులు

మార్కాపురం: తెలుగు భాషా పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీరారెడ్డి మాట్లాడుతూ.. సాంస్కృతిక పరిరక్షణకు మాతృ భాషా సాహిత్యమే కీలకమన్నారు. డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు స్ఫూర్తితో తెలుగు భాషకు తగిన గుర్తింపు, గౌరవం ఉండేలా అందరూ కృషి చేయాలన్నారు. తెలుగు అధ్యాపకుడు జి.వినోద్, డాక్టర్ శేషుకుమార్, ఎంవీ రాఘవేంద్ర, శ్రీధర్, పోలిరెడ్డి, మురళి, సాయి తదితరులు పాల్గొన్నారు.